క్లుప్తంగా

కాంగ్రెస్ 'సోషల్ మీడియా' కన్వీనర్‌గా తిరుపతిరెడ్డి



నెక్కొండ : కాంగ్రెస్ అనుబంధ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా రావుల తిరుపతిరెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ తెలిపారు. ఈ మేరకు తిరుపతిరెడ్డికి మండల కేంద్రంలో శుక్రవారం అశోక్ నియామక పత్రం అందించి మాట్లాడారు. తిరుపతిరెడ్డి పార్టీలో, సోషల్ మీడియాలో క్రియాశీలకంగా పని చేస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు సాంటిరెడ్డి రంజిత్‌రెడ్డి ఆదేశాల మేరకు సముచిత స్థానం కల్పించినట్లు తెలిపారు. తిరుపతిరెడ్డి నియామకం పట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా, పట్టణ అధ్యక్షులు బండి శివకుమార్, సింగం ప్రశాంత్, ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాచకొండ రఘు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలకు బీరువా బహూకరణ



చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌కు ఆంగ్ల ఉపాధ్యాయుడు వెంకటరమణారావు శుక్రవారం బీరువాను బహూకరించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలకు అవసరం ఉన్న నేపథ్యంలో రూ.10 వేల విలువైన బీరువాను తన సొంత డబ్బుతో కొనుగోలు చేసి అందించినట్లు తెలిపారు. వెంకటరమణారావును హెచ్‌ఎం ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలు



రాయపర్తి : మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని సెయింట్ మేరీ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించారు. ఉట్లుకొట్టడం, దాండియా, తదితర సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ శిభు పాల్ మాట్లాడారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా పండుగల పట్ల సైతం అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆ దిశగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సోమన్న, మేనేజింగ్ డైరెక్టర్లు వెంకట్‌రెడ్డి, వేముల రమేష్, రవీనా రాజ్, ఉపాధ్యాయులు రమేష్, బాబు, థామస్, సుజాత, చంద్రకళ, శైలజ, సరస్వతి, సుమలత, రాణి, పీఈటీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గీసుకొండ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని ధర్మారం-కోటగండి మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన బొల్లం విద్యాసాగర్ బంధువు సాయికిరణ్ ద్విచక్ర వాహనంపై వరంగల్-నర్సంపేట రహదారి పక్కనే ఉన్న మరియపురం పరిధిలోని ఫంక్షన్ హాలులో వివాహానికి హాజరై ధర్మారం వెళుతుండగా వరంగల్ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికిరణ్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ అతి వేగం, అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగిందంటూ బొల్లం విద్యాసాగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబూలాల్ తెలిపారు.

నివాళి



పర్వతగిరి : మండలంలోని రోళ్లకల్‌కు చెందిన సీపీఐ సీనియర్ నాయకురాలు బైరు శాంతమ్మ (90) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, సీపీఐ నాయకులు పూలమాల వేసి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. శాంతమ్మ కుమారుడైన బైరు తిరుపతిని, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పాక శ్రీను, దామెదర్, హెచ్‌ఎం రమేష్, శ్రీధర్, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సూరి, యూటీఎఫ్ మండల కార్యదర్శి అరవింద్, కుమార్, సంపత్, మాజీ ఉపసర్పంచ్ జనార్దన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

వర్ధన్నపేట : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణారావు సూచించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడారు. రానున్న రోజుల్లో విజ్ఞాన శాస్త్రానికి ప్రాధాన్యం పెరుగుతుందని తెలిపారు. విద్యార్థులు మూఢ విశ్వాసాలను నమ్మవద్దని, ఎలాంటి ఘటనలు చోటు చేసుకున్నా శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని సూచించారు. ఫిజిక్స్ ఉపాధ్యాయులు మనుజేందర్‌రెడ్డి, కల్యాణి మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం కానుందన్నారు. కొద్దికాలంగా అంతరిక్ష పరిశోధనలు ఊపందుకుంటున్నాయని తెలిపారు. చంద్రునిపై విక్రమ్ ల్యాండర్ అడుగుపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని వివరించారు. విద్యార్థులకు చంద్రయాన్-1, 2, 3లపై విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖనం, పోస్టర్ తయారీ, తదితర పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, వాణి, అశోక్, కుమారస్వామి, రజని, ప్రియదర్శిని, దేవయ్య, రాజేశ్వర్‌రావు, లలిత్‌కుమార్, సునీత, నర్సింగరావు, జయాంజలి తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : పోస్టర్లతో విద్యార్థులు, టీచర్లు

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు అంతరిక్ష కార్యక్రమ వీడియోలను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన అంతరిక్ష మోడల్‌లను, చార్టులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పరిశీలించారు. అంతరిక్ష యానం, పరిశోధనలపై హెచ్‌ఎం రామస్వామి వివరించారు. భూమిపై మానవజాతి మనుగడ కష్టమైన తరుణంలో చంద్రుడు మజిలీగా ఉపయోగపడతాడని చెప్పారు.

నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. తొలుత ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతోందని చెప్పారు. విద్యార్థి దశలోనే శాస్త్ర విజ్ఞానంలో ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



నర్సంపేట రూరల్ : విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి



దుగ్గొండి : అంతరిక్ష నమూనాను పరిశీలిస్తున్న హెచ్‌ఎం రామస్వామి, ఉపాధ్యాయులు

ఫ్రైడే డ్రైడే నిర్వహణ సామాజిక బాధ్యత



నల్లబెల్లి : నీటి నిల్వలను పారబోయిస్తున్న ఎంపీడీఓ

నల్లబెల్లి : ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా ఎంపీడీఓ నర్సింహమూర్తి అభివర్ణించారు. మండలంలోని రేలకుంటలో శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీ అనంతరం ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వల్లో దోమలు వృద్ధి చెందిన డెంగ్యూ, మలేరియా, తదితర రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అనంతరం గ్రామంలో ప్రజలకు ఫ్రైడే డ్రైడే ప్రాముఖ్యత వివరించారు. జనావాసాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. కార్యక్రమంలో రేలకుంట పల్లె దవాఖాన వైద్యుడు డాక్టర్ మహంత్, పంచాయతీ కార్యదర్శి సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండ : గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

నెక్కొండ : సమాజంలోని ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దయాకర్ కోరారు. మండలంలోని అలంకానిపేటలో ఆయన పర్యటించి ప్రజలతో మాట్లాడారు. పరిసరాల శుభ్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించాలని, సైడ్ కాల్వలను శుభ్రం చేయాలని చెప్పారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలలను సందర్శించి తాగునీటి పనులను పరిశీలించారు. జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులతో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి మధు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా సఖి కేంద్రాలు



మాట్లాడుతున్న కేస్ వర్కర్ తిరుమల

చెన్నారావుపేట : సఖి కేంద్రాలు బాధిత మహిళలు, బాలికలకు అండగా నిలుస్తాయని కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న తెలిపారు. మండలంలోని పాపయ్యపేట, జల్లిలో మహిళా సంఘాల మహిళా సభ్యులతో మహిళల హక్కులు, చట్టాలపై ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. మహిళల, బాలికల రక్షణ, భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి కేంద్రాలను నడిపిస్తున్నాయని చెప్పారు. కేంద్రాల్లో బాధిత మహిళలకు కౌన్సిలింగ్ ఇవ్వడంతోపాటు పోలీస్, న్యాయ, వైద్య సహాయం ఉచితంగా లభిస్తాయని తెలిపారు. బాధితులకు కేంద్రంలో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని మహిళలు హెల్ప్‌లైన్ నంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. గృహ హింస, బాల్యవివాహాల నిరోధక, పోక్సో, తదితర చట్టాలతోపాటు సీనియర్ సిటిజన్స్ యాక్ట్, టోల్ ఫ్రీ నంబర్లు 100, 181, 1098, 14567లపై మహిళలు, బాలికలు అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సమస్యలు ఎదురైతే మహిళలు, బాలికలు సఖి కేంద్రాలను ఆశ్రయించవచ్చని చెప్పారు.

'రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం సరికాదు'

రాయపర్తి : రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ రుణమాఫీ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేయలేదని చెప్పారు. రైతులకు రూ.2 లక్షల మేరకు రుణమాఫీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వ సొంతమన్నారు. బీఆర్ఎస్ నాయకులు రాజకీయ మనుగడ కోసమే రైతు ధర్నా, ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో పాలకుర్తి సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, డైరెక్టర్ పెండ్లి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భూక్య సమ్మయ్య, కిసాన్ సెల్ అధ్యక్షుడు చెరుకూరి నాగేశ్వర్‌రావు, ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షులు చిర్ర మల్లయ్య, మచ్చ కుమారస్వామి, నాయకులు గబ్బెట బాబు, మందాటి సుదర్శన్‌రెడ్డి, మద్దెల వెంకన్న, సుతారి యాదగిరి, బండి కుమార్, గౌస్ ఖాన్, దేదావత్ రామ, గుగులోతు యాకూబ్, మోయిన్, గజ్జి వెంకన్న, పీరని ప్రవీణ్, ఉబ్బని నవీన్, బక్కతట్ల శేఖర్, మచ్చ సచిన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

నిర్వాసితులకు స్థలం, ఇల్లు ఇవ్వాలి

వర్ధన్నపేట : పట్టణంలో రోడ్డు వెడల్పులో భాగంగా ఇండ్లు, స్థలాలు కోల్పోయిన నిర్వాసితులకు 70 గజాల స్థలంతోపాటు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో నిర్వాసితులు శుక్రవారం ధర్నా చేయగా కుమారస్వామి మాట్లాడారు. నిర్వాసితులు సాయం కోసం ఎదురు చూస్తుండగా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఎమ్మెల్యే నాగరాజు చొరవ తీసుకుని నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆకాంక్షించారు. స్కిల్ యూనివర్సిటీ, టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటులో ఇండ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పించిందని గుర్తు చేశారు. అదే విధంగా వర్ధన్నపేట-జఫర్‌గఢ్, వరంగల్-ఖమ్మం జాతీయ రహదారుల వెడల్పులో స్థలాలు, ఇండ్లు కోల్పోయిన వారికి స్థలం, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవన్నారు. కార్యక్రమంలో నాయకులు మునిగాల అరుణ్, మిథున్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంగెం : అర్హులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ (ఏఐ కేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడారు. రుణమాఫీ వర్తించక పలువురు రైతులు వేదనకు గురవుతున్నారని తెలిపారు. బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అర్హులందరికీ రుణమాఫీ వర్తించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. రుణమాఫీ అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అటెన్షన్ ప్లీజ్



పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

మండలంలోని రేబల్లె ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. సైడ్ కాల్వలన్నీ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయాయి. వర్షం కురిస్తే వరద నీరు కాల్వల్లోకి వెళ్లకుండా రోడ్ల మీద పారుతోంది. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి సైడ్‌కాల్వలను శుభ్రం చేయించాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చొరవ చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు. -దుగ్గొండి

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
పి.శివకుమార్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 8328405160

'కర్ర'ంటు స్తంభం తొలగింపు



సాక్షి స్పందన

నల్లబెల్లి : మండల కేంద్రంలో రైతు ఉడుత వీరన్న కర్ర సాయంతో వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసుకున్న స్తంభాన్ని విద్యుత్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. 'అటెన్షన్ ప్లీజ్' శీర్షికలో 'సాక్షి' ప్రచురించిన 'కర్ర'ంటు స్తంభాలే దిక్కు కథనానికి ఎన్‌పీడీసీఎల్ ఏఈ రాజు స్పందించారు. వేలాడుతున్న విద్యుత్ వైర్లకు సపోర్టుగా రైతు కర్ర సాయంతో ఏర్పాటు చేసుకున్న స్తంభాన్ని లైన్‌మెన్ హుసేన్, జూనియర్ లైన్‌మెన్ సుధాకర్ తొలగించారు. అలాగే వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేశారు. ఏఈ రాజు, విద్యుత్ సిబ్బంది స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్థికసాయం



చెన్నారావుపేట : మండలంలోని జోజిపేట నారాయణ తండాకు చెందిన సంద ఈరవ్వకు చెందిన రేకుల ఇల్లు ఇటీవల దగ్ధం కాగా బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన తిరుపతి, రవి, తేజ, జయరాజు, సాగర్, దేవీలాల్, తదితరులు కలిసి శుక్రవారం రూ.6 వేల నగదు సాయంగా అందజేశారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో స్వామి, రమేష్, రాజేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

'దేశంలో మహిళలకు రక్షణ కరువు'



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నల్లబెల్లి : దేశంలో మహిళలకు రక్షణ కరువైందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ ఆందోళన వెలిబుచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్ మానితపై హత్యాచారాన్ని నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండలంలోని గొల్లపల్లిలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇట్టబోయిన రవి, ఎల్లబోయిన ఐలన్న, సలుపాల నమేష్, పొన్నం మహేష్, రాజు, కొమురయ్య, అంజి బాబు, మల్లేష్, హైమ, స్వరూప, రాజక్క, లచ్చమ్మ, అన్వేష్, రమేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ



చెన్నారావుపేట : పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్

చెన్నారావుపేట : పరిసరాల శుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధుల బారి నుంచి ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్ తెలిపారు. మండలంలోని కోనాపురంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నర్సంపేట వైద్య కళాశాల ఆధ్వర్యంలో శుక్రజువారం ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం శిబిరం ఇన్‌చార్జ్ డాక్టర్ మురళి మాట్లాడారు. శిబిరంలో 213 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో 11 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి టీ హబ్‌కు పంపినట్లు చెప్పారు. వర్షాకాలంలో వాంతులు, విరేచనాలు, జ్వరాలు, పలు రకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. తదనంతరం ఎంపీడీఓ శ్రీవాణి మాట్లాడారు. ప్రజలను సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడేలా ప్రభుత్వం వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తోందని చెప్పారు. పేదలు శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ రాజునాయక్, డాక్టర్ ఆఫ్రిన్ శాన్వాజ్, డాక్టర్ అర్చన, డాక్టర్ అక్షిత, డాక్టర్ సింధూర, డాక్టర్ వాసవి, డాక్టర్ మట్ట భరత్‌రెడ్డి, భద్రయ్య, మహేందర్‌రెడ్డి, తండ విజయ్‌కుమార్‌గౌడ్, దయాకుమారి, ఎంపీఓ శ్రీధర్ రాజు, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండ : రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నెక్కొండ: వృద్ధులు దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆయుష్ విభాగం ఇన్‌చార్జ్ మైదం రాజు అన్నారు. గుండ్రపల్లి గ్రామంలో నెక్కొండ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యులు శుక్రవారం వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదంలో దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స ఉందని తెలిపారు. బీపీ, షుగర్, కీళ్ల నొప్పుల వ్యాధిగ్రస్తులను గుర్తించామన్నారు. అనంతరం ఆయన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులుఎ పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వైద్యురాలు అనిత, ఆయుష్ డీపీఎం రాజు, గ్రామ కార్యదర్శి రవికుమార్, ఫార్మసిస్ట్‌లు శ్రీలక్ష్మి, ఖాజా, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలల సంపూర్ణ వికాసమే ధ్యేయం

- ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ

చెన్నారావుపేట : బాలల సంపూర్ణ వికాసమే ధ్యేయంగా అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా తీర్చిదిద్దుతున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చెన్నారావుపేట, నెక్కొండ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తల్లులు, గర్భిణులు, చిన్నారులు వినియోగించుకునేలా టీచర్లు చొరవ చూపాలని చెప్పారు. కేంద్రాల్లో బాలల బరువు తూచి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎంపీడీఓ శ్రీవాణి మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి బాటలు వేసేలా కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలను గర్భిణులు, తల్లులు, చిన్నారులు వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏసీడీపీఓ హేమలత, చెన్నారావుపేట, నెక్కొండ సూపర్‌వైజర్లు శ్రీలత, అనిత, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ మధురిమ

డీఆర్‌డీఓ ఆదేశాలు బేఖాతరు..!

- మొక్కలు నాటించకుండా నిర్లక్ష్యం

నల్లబెల్లి : రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలన్న డీఆర్‌డీఓ కౌసల్యదేవి ఆదేశాలను స్థానిక పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్ బేఖాతరు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు ఇలా.. గత నెల 25న మండల కేంద్రంలో చేపట్టిన వనమహోత్సవానికి డీఆర్‌డీఓ కౌసల్యదేవి హాజరై పరిశీలించారు. మండల కేంద్రంలో రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటకపోవడంతో ఎంపీఓ పసరగొండ రవి సమక్షంలో పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు ఎందుకు నాటించలేదని ప్రశ్నించారు. వారం రోజుల్లో పూర్తి స్థాయిలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించాలని ఆదేశించారు. కాగా ఇప్పటివరకు డీఆర్‌డీఓ ఆదేశించి నెల రోజులు గడచినా ఒక్క మొక్క కూడా నాటించని విషయమై మండలంలోని ప్రజలు, వన ప్రేమికులు అసమనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన 'పచ్చదనం-పరిశుభ్రత' కార్యక్రమంలోనైనా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా డీఆర్‌డీఓ ఆదేశాల మేరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించాలని వన ప్రేమికులు కోరుతున్నారు.



పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఆర్‌డీఓ కౌసల్యదేవి (ఫైల్)

క్రమశిక్షణతోనే జీవితంలో ఉన్నతి

వర్ధన్నపేట : క్రమశిక్షణ అలవర్చుకోవడం ద్వారానే జీవితంలో ఉన్నతి సాధించగలరని ప్రముఖ స్టూడెంట్ కౌన్సిలర్, అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బూర భిక్షపతి స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గూళ్ల వెంకటయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమానికి భిక్షపతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించడం సులువని చెప్పారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించే దిశగా ప్రణాళికాయుతంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం గత మార్చిలో జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలో ఎంపీసీ విభాగంలో 377 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిన రాంచరణ్ తేజకు, బైపీసీలో 342 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన అర్చన, సీఈసీలో హాజీరా సుల్తానా, హెచ్ఈసీల్లో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. అనంతరం భిక్షపతిని, ప్రిన్సిపాల్ వెంకటయ్యను అధ్యాపకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, సువర్ణ వేణి, రాజ్‌కుమార్, శోభారాణి, స్వరూప, సమీనా, డాక్టర్ వేణు మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు సర్వే

గీసుకొండ : బీఎల్ఓలు నూతన ఓటరు నమోదుకు మండలంలో ఇంటింటి సర్వే చేపట్టాలని తహసీల్దార్ రియాజుద్దీన్ అదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతిఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని చెప్పారు. అక్టోబర్ 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని, నవంబర్ 28 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. అన్ని రకాల తప్పులను సవరించి ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, ఆర్ఐ సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.